

'ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి'

భగత్‌నగర్, ఏప్రిల్ 27: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మార్చి, ఏప్రిల్, మేలో పని చేసే కూలీలకు ప్రత్యేకంగా వేసవి అలవెన్స్ చెల్లించాలన్నారు. పనిచేస్తున్న ప్రదేశాల్లో నీడసౌకర్యం, మంచినీటి వసతి కల్పించడంతో పాటు పని ప్రదేశాలు దూరంగా ఉంటే రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరలు పెరిగాయి

- కరీంనగర్‌లో రెండు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి
- కాంగ్రెస్, బీజేపీ కుట్ర రాజకీయాలకు చరమగీతం పాడాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వస్తువుల ధరలు పెరిగాయి సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శనివారం రాత్రి కరీంనగర్‌లో అయన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరుపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ బస్ యాత్రతో కాంగ్రెస్ పీఠం కదులుతోందని, ప్రజలు ఆలోచిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరీంనగర్‌లో రోజూ ఇచ్చే తాగునీళ్ల రెండురోజులకొకసారి ఇస్తున్నారని, మురికి నీరు వస్తుందని చెబుతున్నారని, కరెంటు కోతలు మొదలయ్యాయన్నారు. ఐదేళ్ల కేసీఆర్ పాలనలో రోజు నీళ్లు ఇస్తే ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదనే విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి చరమ గీతం పాడాలని ప్రజలను కోరారు. ఎంపీగా వినోద్‌కుమార్ స్మార్ట్‌సిటీ తీసుకు వచ్చారని, కొత్తపల్లి, మనోహరాబాద్ రైల్వే లైనును పరుగు పెట్టించారని తెలిపారు. మేధావి, అభివృద్ధి, ప్రజా సమస్యలపై అవ గాహన ఉన్న వినోద్ కుమార్‌ను మళ్లీ గెలి పించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికా రంలో ఉన్నా ఎంపీ బండి సంజయ్ ఒక్క టైనా సాధిం చారా అని ప్రశ్నించారు. కనీసం ఆ పార్టీ కార్యకర్తలకు కూడా ఏమి చేయ లేదని విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధి, ప్రజ లకు మేలు జరిగేందుకు మేధావులు ఆలో చించి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు.



కరీంనగర్‌లో ప్రచారం చేస్తున్న హరీష్‌రావు, వినోద్ కుమార్

● బీజేపీ, కాంగ్రెస్‌వి కుమ్మక్కు రాజకీయాలు

శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్, బీజేపీలు కుమ్మక్కయ్యాయని, మోదీ సర్కార్ రిజర్వేషన్లను తొలగిస్తే బీఆర్ ఎస్ మద్దతిస్తుందంటూ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆరు గ్యారెంటీల గురించి, నాలు గున్నర నెలల పాలన గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడడం లేదన్నారు. బీజేపీతో కుమ్మక్కై దొంగేదొంగ అన్నట్లుగా రేవంత్‌రెడ్డి వ్యవ హరిస్తు న్నాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలా కర్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

● బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిచాలి

జమ్మికుంట: పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతుక వినబడాలంటే తమ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. శనివారం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో తో కలిసి వాకర్స్‌తో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఐదు రూపాయాలు కూడా తీసుకు రాలేదన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే సింగాపూర్‌లోని ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలాజికల్ ఎడ్యూకేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కరీంగనర్‌కు తీసుకు వస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, గెల్లు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ పాల్గొన్నారు.

● పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక వినోద్‌కుమార్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్: ప్రజా సమస్యలపై అవ గాహన ఉన్న బోయినపల్లి వినోద్‌కుమా ర్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తే పార్లమెం ట్‌లో ప్రశ్నించే గొంతుక అవుతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శని వారం నగరంలోని ఎమ్మెల్యే కమలాకర్ నివాసంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కార్పొరేటర్లతో ప్రత్యేక సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా కమలాకర్ మాట్లా డుతూ వినోద్‌కుమార్ ఎంపీగా గెలిస్తే నిత్యం అందుబాటులో ఉంటార న్నారు. సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ పాల్గొన్నారు.



కరీంనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న హరీష్‌రావు, వినోద్ కుమార్



వాకర్స్‌తో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది

- కేసీఆర్ కలుగులోని ఎలుక
- ఎన్నికలప్పుడే ఫాం హౌస్‌ను వీడి భయటకొస్తాడు
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



వాకర్స్‌తో కలిసి నడుస్తున్న ఎంపీ బండి సంజయ్ కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే రెండు పార్టీలు ఒక్కటై తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో వాకర్స్, యువకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కలుగులోని ఎలుక అని, ఎన్నికలప్పుడు మాత్రమే బయటకు వస్తాడని, ఆ తర్వాత ఫాంహౌస్‌కే పరిమితమవుతాడనిఎద్దేవా చేవారు. ముఖ్యమంత్రి బీజేపీని పాకిస్తాన్ టీంగా అభివర్ణించడాన్ని తప్పు పట్టారు. బీజేపీ భారతీయ ఆత్మ అని, హిందుత్వ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న పార్టీ అన్నారు. ఫైటర్స్.. చీటర్స్.. లూటర్స్ జరగుతున్న పోరులో ఫైటర్స్ పార్టీ బీజేపీ గెలుస్తుందన్నారు. ప్రజల ముఖమే చూడని అభ్యర్థులకు, ప్రజల పక్షాన నిత్యం ప్రశ్నించే గళానికి పోటీ అన్నారు. కెప్టెన్ దిక్కులేని కాంగ్రెస్‌తో తమకు పోటీ ఏమిటని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధించబోతున్నా రన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసిపోతాయని చెప్పడం కాంగ్రెస్ ఆడుతున్న రాజకీయ డ్రామాలో భాగమేనన్నారు.



కండువాలు కప్పి నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్

● ఆరు గ్యారెంటీలపై మాట తప్పారు

రుణమాఫీపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు సవాళ్ల, ప్రతి సవాళ్ల విసురుకుంటూ బ్రేకింగ్ న్యూస్‌లో ఉండేందుకు తహతహలాడుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమ ర్శించారు. శనివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో పలువురు నాయ కులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యా రెంటీల అమలు నిరూపించక పోతే కాంగ్రెస్ అభ్యర్థులంతా పోటీ నుంచి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీల అమలుపై చర్చ జరగ కుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు డ్రామాలాడుతున్నారన్నారు.వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అ మలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కించపరుస్తారా.. వీళ్లు హిందువులేనా అని ప్రశ్నించారు.

● బీజేపీలో భారీ చేరికలు

బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో ఎంపీ కార్యాలయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు భారీ ఎత్తున బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్ సోద రుడు మహేందర్‌గౌడ్, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకుడు కోడూరి రామక్రిష్ణ, గాలి రవియాదవ్, తెలంగాణ ఉద్యమకారులు కుమార్, మెతుకు భాస్కర్, చామనపల్లి సురేందర్‌కు కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ డిప్యూటి మేయర్ గుగ్గిళ్లపు రమేష్, మాజీ ఎంపిపి వాసాల రమేష్ పాల్గొన్నారు.

● పొన్నం తిట్లను దీవెనగా భావిస్తా

బోయినపల్లి: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే మంత్రి పొన్నం ప్రభాకర్ తనను వెధవ అంటూ దూషిస్తున్నారని, ఆయన తిట్లను దీవెనగా భావిస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. పొన్నం వెధవ అంటే తన దృష్టిలో వెయ్యేళ్లు ధనికుడిగా వర్ధిల్లు అని అర్థమని చెప్పారు. శనివారం మధ్యాహ్నం బోయినపల్లి మండలానికి వచ్చిన బండి సంజయ్ మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో కలిసి పార్టీ పన్నా ప్రముఖుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలంతా తమ పోలింగ్ బూత్‌ల పరిధిలోని తటస్థ ఓటర్లతోపాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలను కలిసి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ఎన్నికల నాటికి ప్రతి కార్యకర్త ఇంటింటికీ మూడుసార్లు వెళ్లి ఎన్నికల ప్రచారం చేయాలని సూచించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఘోరంగా ఓడిపోతున్నాయని చెప్పారు. ఓడిపోతాననే భయంతో కాంగ్రెస్ అభ్యర్థి ఓటుకు వెయ్యి రూపాయలు ఇచ్చి గెలవాలని యత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు చీకటి ఒప్పందాలు చేసుకుని తనను ఓడించాలని కుట్ర చేస్తున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు అల్లాడి రమేష్, మండల శాఖ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బోయినపల్లిలో మాట్లాడుతున్న బండి సంజయ్



నిర్మానుష్యంగా ఉన్న జమ్మికుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతం

కరీంనగర్‌లో...

ఎండలు బాబోయ్..

రాష్ట్రంలోనే అత్యధికంగా జమ్మికుంటలో 45.4 డిగ్రీలు నమోదు

జమ్మికుంట, ఏప్రిల్ 27: జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతు న్నాయి. జమ్మికుంటలో వరుసగా రెండో రోజు రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అ య్యాయి. శనివారం 45.4డిగ్రీల ఉష్ణోగ్రతలతో భానుడు తన ప్రతాపం చూపించాడు. శుక్రవారం 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత అధికంగా ఉండ డంతో ఉదయం 10గంటల నుంచే ప్రజ లకు భయటకు రావాలంటే జంకుతు న్నారు. వేడి గాలులు, ఉక్క పోతతో ఉక్కిరి బిక్కిరి అవుతు న్నారు. మధ్యాహ్నం సమయంలో ఎటు చూసినా ప్రజల రాకపోకలు లేక రహదారులు నిర్మానుష్యంగా కని పిస్తు న్నాయి. అత్యవసర పరిస్థితుల్లో గొడుగులు,టవల్స్ నెత్తికి చుట్టుకుని బయటకు వస్తున్నారు. వీణ వంకలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కరీంనగర్ జిల్లా కేంద్రం లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.



జమ్మికుంటలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్

కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి : డీఈవో

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: జిల్లాలో ఏర్పాటు చేస్తున్న కోచింగ్ సెంటర్లు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి ఉన్న కోచింగ్ సెంటర్లలో మాత్రమే తమ పిల్లలకు కోచింగ్ ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్‌కు గుర్తింపు లేదు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 27: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్(హాయ్)కు గుర్తింపు లేదని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజులుగా ఆ సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు, సంఘానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ సంఘానికి తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ (టీహెచ్‌ఏ), జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ నుంచి ఎలాంటి గుర్తింపు కాని, అఫ్లియేషన్ కాని, అనుమతులు లేవని తెలిపారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్‌పై చట్టపరమైన చర్యల కోసం ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఘనంగా సప్త వర్ణాలు.. ఏకాంత సేవ

● ఇల్లందకుంటలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇల్లందకుంట, ఏప్రిల్ 27: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. సాయంత్రం నిత్యవిధి, గరుడ సేవలు నిర్వహించారు. అనంతరం సప్త వర్ణాలు, అద్దాల మండపంలో స్వామివారి ఏకాంత సేవ కార్యక్రమం అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరాచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు మాట్లాడుతూ 13 రోజులుగా వైభవంగా బ్రహ్మోత్సవాలు జరిగాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

సోదరుల మధ్య ఘర్షణ .. తమ్ముడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో శనివారం ఇద్దరు సోదరులు ఘర్షణ పడగా తమ్ముడు కాల్వ వెంకటేష్‌యాదవ్(28) మృతి చెందాడు. గ్రామస్థులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కాల్వ వెంకటేష్, కాల్వ శ్రీనివాస్‌లు అన్నదమ్ములు. మద్యానికి బానిసైన ఇద్దరు సోదరులు ఎలాంటి పనులు చేయకుండా తరచుగా గొడవపడుతుంటారు. వారి తండ్రి రాయమల్లు గొర్లకాపరిగా పనిచేస్తుంటాడు. శనివారం సాయంత్రం అన్నదమ్ముల మధ్య గొడవ జరగ్గా శ్రీనివాస్ ఇంటిలోని ఈలపీటతో వెంకటేష్ నడుం భాగంలో కొట్టాడు. దీంతో ఆగ్రహంతో శ్రీనివాస్‌ను వెంకటేష్ కొట్టేందుకు రాగా అతన్ని నెట్టివేయడంతో భవనం పిల్లర్‌కు తల తగిలింది. దీంతో వెంకటేష్ చెవుల నుంచి రక్తం కారి కొద్దిసేపటికి మరణించాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

760 లీటర్ల మద్యం సీజ్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలలో బెల్ట్ షాప్‌లపై దాడులుచేసి రూ. 4.60 లక్షల విలువైన 760 లీటర్ల మద్యంను సీజ్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించిన 96 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ యజమానులు బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ 109 మందిపై కేసులు నమోదు చేసి రూ .5.17లక్షల విలువైన 957 లీటర్ల మద్యం సీజ్‌చేశామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్‌లు, కిరాణ దుకాణాల్లో, ఇతర ఇళ్లల్లోనూ ఎవరైనా బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని దుప్పి మృతి

కథలాపూర్, ఏప్రిల్ 27: మండలంలోని దుంపెట శివారులో వరద కాలువ వద్ద శనివారం కారు ఢీకొట్టిన ఘటనలో చుక్కల దుప్పి మృతి చెందింది. సెక్షన్ అధికారి మల్లేశం కథనం ప్రకారం.. చింతకుంటకు చెందిన అనుప రాజేశ్ టీఎస్ 21 సీ 8991 నంబర్ గల కారులో తన స్వగ్రామం వెళ్తుండగా అటువైపు నుంచి వేగంగా వచ్చిన దుప్పిని ఢీకొట్టాడు. గాయాల పాలై అపస్మారక స్థితికి చేరిన దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. కారును సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సెక్షన్ అధికారి తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: ధాన్యం కుప్పలను బైక్ ఢీకొన్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన వ్యక్తి ఎర్పుల రాములు తీవ్ర గాయాలపాలయ్యాడని సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. రోడ్డుపై ధాన్యం కుప్పలు పోసి ప్రమాదానికి కారణమైన కిష్టునాయక్‌తండాలోని రైతు భూక్య నరేశ్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రాములు తన ద్విచక్ర వాహనంపై ఈ నెల 26న సాయంత్రం గొల్లపల్లికి వెళ్లి రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో రహదారిపై ఉన్న ధాన్యం కుప్పలను ఢీకొట్టాడని చెప్పారు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని వివరించారు. బాధితుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు రోడ్డుకు అడ్డుగా ధాన్యం కుప్పలు పోసిన రైతు నరేశ్‌పై ఎస్ఐ రమాకాంత్ కేసు నమోదు చేయగా దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్- కోరుట్లపేట గ్రామ శివారులోని రహదారిపై ఉన్న వరి ధాన్యం కుప్పను ద్విచక్రవాహనంతో శనివారం రాత్రి ఢీకొన్న సంఘటనలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రాజనర్సు తీవ్ర గాయాలపాలయ్యాడు.

జగిత్యాలలో రెండిళ్లలో చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 27: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న ఆదర్శనగర్‌లో రెండిళ్లలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆదర్శనగర్‌కు చెందిన శేఖర్‌రెడ్డి, కోటి అనే ఇద్దరు వ్యక్తులకు చెందిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.61 వేల నగదును అపహరించుకవెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 27: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 24న రాత్రి గ్రామంలో హరీష్ అనే వ్యక్తి తన బంధువులతో సహా డ్యాన్స్ చేస్తుండగా అటువైపుగా వెళ్లిన మ్యాకల ఉదయ్ అనే వ్యక్తిని ఆపి చేతులతో కొట్టి, కులం పేరుతో దూషించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఉదయ్ ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ రావు శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సాక్షులను విచారించారు.

కంబోడియా కేంద్రంగా సైబర్ మోసాలు

● చైనీస్ కంపెనీ పేరిట కాల్ సెంటర్ ● ఇద్దరి ఏజెంట్ల అరెస్టు, మరో ఇద్దరికి లుక్ అవుట్ నోటీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: కంబోడియా కేంద్రంగా చైనీస్ కంపెనీ పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠా వ్యవహారాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్ చేసి మరో ఇద్దరికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మి తన కుమారుడు శివప్రసాద్‌ను గల్ఫ్ పంపేందుకు జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన కంచర్ల సాయిప్రసాద్ అనే ఏజెంట్‌ను కలిసింది. ఇందుకోసం రూ.1.40 లక్షలు ఇచ్చింది. ఏడాది క్రితం శివప్రసాద్‌ను కంబోడియా పంపించిన ఏజెంట్ సైబర్ మోసాలకు పాల్పడే కాల్‌సెంటర్‌లో పని ఇప్పించాడు. ఇండియాకు చెందిన ఫోన్ నంబర్లకు కాల్ చేసి సైబర్ మోసం చేయమంటూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివప్రసాద్ తన తల్లి ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చాడు. లక్ష్మి ఫిర్యాదుతో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. చైనీస్‌కు చెందిన కంపెనీలో శివప్రసాద్ పాస్‌పోర్ట్ తీసుకున్నట్లు, సైబర్ నేరాలు చేయిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడితోపాటు ఇండియాకు చెందిన 600 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే కంబోడియాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడినట్లు, బాధితుడి వివరాలు పంపించి అక్కడి పోలీసుల సహాయంతో రెస్క్యూ చేసి శివప్రసాద్‌ను కాపాడినట్లు ఎస్పీ చెప్పారు. శివప్రసాద్ రెండు రోజుల్లో సిరిసిల్లకు చేరుకుంటాడని, మిగతా బాధితులను ఇండియాకు పంపించే ఏర్పాట్లు చేశామని ఎస్పీ వివరించారు.

ఉపాధి పేరిట సైబర్ మోసాలకు పాల్పడే కాల్ సెంటర్‌లో ఉద్యోగం పెట్టించి మోసం చేసిన ఏజెంట్లు జగిత్యాల జిల్లా కొడిమ్యాల గ్రామానికి చెందిన కంచర్ల సాయిప్రసాద్, మహారాష్ట్రలోని పూణేకు చెందిన అబిద్ అన్సరీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

● కమీషన్‌ల కోసం ఏజెంట్ల దందా

కమీషన్‌ల కోసం ఏజెంట్లు దందాకు పాల్పడుతున్నట్లు తేలింది. కంబోడియా ఏజెంట్‌గా పనిచేసిన సాయిప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. బాధితుడు ఇచ్చిన మొత్తంలో సాయిప్రసాద్ రూ.10వేల కమీషన్ తీసుకొని లక్నోకి చెందిన సదాకత్ అనే వ్యక్తికి పంపిస్తాడు. ప్రస్తుతం మాల్దీవ్స్‌లో ఉంటున్న సదాకత్ రూ.10వేల కమీషన్ తీసుకొని పూణేకు చెందిన అబిద్ అన్సరీకి పంపిస్తాడు. అతను దుబాయ్‌లో ఉంటున్న బీహార్‌కు చెందిన షాదబ్ అనే వ్యక్తికి మిగిలిన మొత్తంతో పాటు, పాస్‌పోర్టు పంపిస్తే కంబోడియా దేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్పీ చెప్పారు. దీంతో కంచర్ల సాయిప్రసాద్, అబిద్ అన్సరీ అనే ఏజెంట్లను అరెస్ట్ చేశామని, సాయిప్రసాద్‌ను కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. అబిద్ అన్సరీకి నోటీసులు ఇచ్చి పంపామని, పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. గల్ఫ్ ఉద్యోగాల పేరిట ఏజెంట్ల చేతిలో మోసపోతే వెంటనే 8712656411కు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు నిధి ఆప్కే నికత్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం, ఈఎస్ఐసీ సంయుక్తంగా ఈనెల 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు నిధి ఆప్కే నికత్-2 (పీఎఫ్ మీ ముంగిట) జిల్లా అవగాహన శిబిరం, ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగునూరు ప్రతిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్)లో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాకు సంబంధించి సుల్తానాబాద్ రఘురామ్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, జగిత్యాల జిల్లా కోరుట్ల మోసాక్ బీడి వర్క్స్‌లో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు సంబంధించి తంగళ్లపల్లి ఠాకూర్ వైఎస్ బీడీ వర్క్స్‌లో, మంచిర్యాలలో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో, ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించి సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో, ఆదిలాబాద్‌లో నలంద డిగ్రీ కళాశాలలో, నిర్మల్‌లో ఎస్‌టి థామస్ స్కూల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్షనర్లు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

వరిపంట దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 27: మండలంలోని మల్యాల గ్రామ శివారులో ఆ గ్రామానికి చెందిన రైతు పంజాల శంకరయ్య కోతకొచ్చిన ఎకరంన్నర వరి శనివారం అగ్నికి ఆహుతి అయింది. పొలం దగ్ధమై సుమారు లక్ష రూపాయల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. వరి పొలం ప్రమాదవశాత్తు కాలిందా ఎవరైనా అంటుపెట్టారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కక్షతోనే వరి పంటకు నష్టం చేశారని బాధితుడు తెలిపారు.

నగదు స్వాధీనం

పాలకుర్తి, ఏప్రిల్ 27: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి అడ్డరోడ్డు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా 2,41,760 రూపాయల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. జిల్లాలోని జూలపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లారపు శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద లక్ష రూపాయలు, మంచిర్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన తాళ్ల సతీష్‌కుమార్ అనే వ్యక్తి వద్ద 61 వెయ్యి 760 రూపాయలు, అదే గ్రామానికి చెందిన ఎడ్ల గణేష్ వద్ద 80 వేల రూపాయలను సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అందించినట్లు ఎస్సై తెలిపారు.

● ఇల్లందకుంట : మండలంలోని సిరిసేడు గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ.1.50లక్షలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సిద్దిపేటకు చెందిన పృథ్వీరాజ్ అనే అతను ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బులు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు సీఐ కిశోర్ పేర్కొన్నారు. ఎస్ఐ రాజకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

వీణవంక, ఏప్రిల్27: మండలంలోని బేతిగల్‌లో చొప్పరి తిరుపతి అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 2,400 రూపాయల విలువ చేసే బ్రాందీ, విస్కీ పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేతన్నలను పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్

● పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేండ్లు పరిపాలించినా పవర్‌లూం నేత కార్మికులు, పద్మశాలి సమాజాన్ని పట్టించుకోలేదని, రెండు పార్టీలు శవ రాజకీయాలు చేస్తున్నాయని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడ్డ వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయి, తంగళ్లపల్లిలో అంకారపు మల్లేశం కుటుంబాలను, కాంగ్రెస్ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పది సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్, సిరిసిల్లకు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సిరిసిల్ల నేత కార్మికులు, పద్మశాలి సమాజానికి ఏమీ చేయలేదని అన్నారు. బీజేపీ వస్త్ర పరిశ్రమకు 12 శాతం జీఎస్టీ వేసిందని అన్నారు. 26 వేల మరమగ్గాలపై పేద నేత కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ ఆర్డర్లకు సంబంధించి రూ.275 కోట్ల బకాయిల బిల్లులు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చెల్లించే ప్రయత్నం చేస్తుందని అన్నారు.ఎలక్షన్ కోడ్ ముగిసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం పవర్‌లూం పరిశ్రమ కోసం కొత్త పాలసీ తీసుకవస్తుందని అన్నారు.

పొలిమేర వరకు తరిమికొడతాం : మంత్రి పొన్నం

శవ రాజకీయాలు చేస్తూ పది సంవత్సరాలు అధికారంలో ఉండి కాంగ్రెస్



తంగళ్లపల్లిలో కార్మిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న దీపదాస్ మున్షీ

ప్రభుత్వంపై విమర్శలు చేసే పరిస్థితి వస్తే తప్పులు, అప్పులు చేసిన వారిని పొలిమేర వరకు తరిమికొడతామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిరిసిల్లలో ఆత్మహత్యలు దురదృష్టకరమని అన్నారు. గత ప్రభుత్వంకు కేవలం బతుకమ్మ చీరలపై ధ్యాసే ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 1 ద్వారా బట్ట ఆర్డర్లు తెలంగాణ వ్యాప్తంగా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్యశివప్రసాద్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల బాలయ్య దీపదాస్‌కు వినతిపత్రం అందించారు.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అవినీతిమయం

● గంగాధరలో ఏసీబీకి చిక్కిన ఎస్ఆర్‌వో

● గతంలో స్టాంపుల కుంభకోణంలో సస్పెండ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27 : స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో లంచాలు లేనిదే ఏ ఫైల్ కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయి. ఇళ్లు, ఇంటిస్థలాలు, భూములు, మార్టిగేజ్, తదితర రిజిస్ట్రేషన్‌లు జరగాలంటే అధికారులకు లంచాలు ముట్టాల్సిందే. తాజాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కరీంనగర్ డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శివారపు సురేష్‌బాబు నెల రోజుల కిందటే గంగాధర ఇంచార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా వెళ్లి శనివారం కార్యాలయం అటెండర్ కొత్తకొండ శ్రీధర్ ద్వారా 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గతంలో సురేష్‌బాబు స్టాంపుల కుంభకోణంలో నిందితుడిగా ఉండి ఒకసారి సస్పెండ్‌కు కూడా గురయ్యాడు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పురాలేదని విమర్శలు వస్తున్నాయి.

● ఎస్ఆర్‌వో సురేష్‌బాబు ఇంటిలో ఏసీబీ సోదాలు

లంచం డబ్బులు తీసుకుంటూ ఏసీబీ పోలీసులకు పట్టుబడిన ఎస్ఆర్ఓ సురేష్‌బాబును గంగాధరలో కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ పోలీసులు కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి 12 లక్షల 30 వేల



ఎస్ఆర్ఓ సురేష్‌బాబు ఇంటిలో సోదాలు చేస్తున్న ఏసీబీ పోలీసులు

నగదుతోపాటు 350 గ్రాముల బంగారు ఆభరణాలను, ఇతర కీలక డాక్యుమెంట్లు సీజ్ చేశారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఎస్ఆర్ఓ సురేష్‌బాబు, కొత్తకొండ శ్రీధర్‌లను ఆదివారం కరీంనగర్ ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరుస్తామని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి తెలిపారు.

● స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ, ఆర్టీఏ, అటవీశాఖతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఇదే విధంగా ప్రభుత్వ అధికారులు వారి కార్యాలయాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్స్, కాంటాక్టు ఉద్యోగులతో లంచాలు డబ్బులు తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖకు పట్టుబడ్డారు. లంచం డబ్బులు తీసుకుంటూ ఇటు ఉద్యోగం, అటు కోర్టు కేసులతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 27: మానకొండూర్ గ్రామానికి చెందిన బొల్లం శివమ్మ (85) అనే వృద్ధురాలు శనివారం బావిలో పడి మృతి చెందింది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శివమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయింది. శనివారం శివమ్మ తన రెండో కుమారుడు బొల్లం శంకర్ ఇంటిలోని చేద బావిలో పడి ఉండడాన్ని కుటుంబీకులు గమనించారు. బావిలో నుంచి బయటికి తీయగా అప్పటికే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి శనివారం జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 25 మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపరచగా అందులో ఒక వ్యక్తికి 7 రోజులు, మరో వ్యక్తికి 5 రోజులు, ఆరుగురు వ్యక్తులకు 3 రోజుల వంతున జైలుశిక్షతో పాటు మొత్తం 16,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 17 మందికి 25 వేల రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

ఖనిలో రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు గోదావరిఖని వేదికైంది. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఈ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగనున్నది. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనున్నాయి. 10వ సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌ను సింగరేణి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో నిజామాబాద్, వరంగల్ జట్లు తొలి మ్యాచ్‌లో పోటీపడగా నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో వనపర్తి, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో వనపర్తి జట్టు విజయం సాధిం చింది. మూడవ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరుగగా డ్రాగా ముగిసింది. 5వ మ్యాచ్ రంగారెడ్డి, మెదక్ జట్లు మధ్య జరిగి న మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. 6వ మ్యాచ్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్ నల్గొండ, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు గెలుపొం దింది.

ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ ఆర్పీ నాయుడు, కోశాధికారి సామాల సత్యనా రాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

● పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా తాగునీరు సరఫరా చేయాలని అందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మిషన్‌భగీరథ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. శనివారం జిల్లాలోని రుద్రవరం ఇంటెక్‌వెల్, అగ్రహారం నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోనీటి నిల్వ పూర్తి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 5.90 టీఎంసీలకు తగ్గడం వల్ల వేసవిలో మిషన్‌భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. మిషన్ భగీరథ నీటి అవసరాలు, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మూడు నెలలకు 0.36 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని ప్రస్తుతం 4 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉందని వివరించారు. ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు సమృద్ధిగా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, మిషన్‌భగీరథ సీఈ అమరేంద్ర, ఎస్ఈ రవీందర్, ఈఈలు విజయ్‌కుమార్, జానకి తదితరులు ఉన్నారు.



నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సందీప్ కుమార్ సుల్తానియా

రాజన్న సేవలో సందీప్ కుమార్ సుల్తానియా

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమిలతో కలిసి ఆయన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనము గావించారు.

వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్27: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ పరిధిలో ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి శనివారం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 30నుంచి 40సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన దశలో ఉందని, మృతుడు నలుపురంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు ఎలగందుల గ్రామ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్27: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణ పతి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు.



క్యూలైన్‌లో భక్తులు

లక్ష్మీనగర్‌లో కుక్కల స్వైర విహారం

● ఆరుగురు చిన్నారులపై దాడి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: గోదావరిఖనిలో పిచ్చి కుక్కల స్వైర విహారం ఆగడం లేదు. వారం రోజుల క్రితం మార్కండేయకాలనీలో ఎనిమిది మందిపై దాడి చేయగా శనివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పిచ్చి కుక్కలు ఆరుగురు చిన్నారులపై దాడికి పాల్పడ్డాయి. ప్రహస్య, చక్రిక్రశ్రీ, నిత్య మరో ముగ్గురు చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. గాయాలపాలైన చిన్నారులను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రాత్రివేళల్లో కుక్కలు నడిచి వెళ్లేవారిపై, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నాయి. గత ఏడాది ఎల్‌బీనగర్‌లో కుక్కలు మోటార్ సైకిల్‌పై వెళుతున్న హమాలీని వెంబడించగా వాహనం అదుపు తప్పి కార్మికుడు మృతి చెందాడు. అయినా కార్పొరేషన్ అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. గుంపులు గుంపులుగా కోతులు, కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డైరెక్టర్‌కు ఘన నివాళి



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి కనకదుర్గ తృతీయ వర్ధంతి సందర్భంగా శనివారం కరీంనగర్ యూనిట్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ కె.సంపత్‌రెడ్డి, సిబ్బంది

కార్మికుల హక్కులను కాపాడుకోవాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 27: మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులను కాపాడుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ అధికారంలోకి రాగానే పెట్టుబడి దారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జక్కుల ఆగయ్య, ఓర్సు కొమురయ్య, కేంసారం శ్రీనివాస్, ఎస్‌కె సుల్తాన్, దానవేణి రమేష్, మేకల కుమార్, సంపత్, సురేందర్‌రెడ్డి, నడిగడ్డ సంపత్, పింగిరవి, అల్లపు బాలయ్య, బొంతల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలి'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయనకు సంఘీభావంగా తెలంగాణ స్టేట్ రెడ్డి యూత్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, పండ్లు, మజ్జిగను పంపిణీ చేశారు. శనివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వినోద్‌కుమార్‌ను రెండవసారి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపిస్తే కరీంనగర్ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో పవన్‌కుమార్, నరసింహ, రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ, బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా దీక్ష



దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 27 : ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ బండి సంజయ్ విద్వేషపూరిత వ్యాఖ్యలను నిరసిస్తూ డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి శనివారం 4 గంటల పాటు నిరసన దీక్ష చేశాడు. ప్రధాని మోదీ మహిళలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలు చేశారని, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా చేసిన మాట్లాడారన్నారు. బండి సంజయ్ ఐఎన్‌సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్ అంటూ కించపరిచే విధంగా మాట్లాడిన మాటలకు నిరసనగా ఈ నిరసన దీక్ష చేపట్టినట్లు ఆకారపు భాస్కర్ రెడ్డి తెలిపారు. మండుటెండలో వినూత్న రీతిలో చేపట్టిన నిరసన దీక్షను మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై భాస్కర్ రెడ్డికి పూలమాలవేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నరేంద్రమోదీ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఆరోపణ చేస్తున్నారని విమర్శించారు. అనంతరం డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. దీక్ష విరమించి కార్యాలయంలోకి వెళ్లిన కొద్దిసేపటికి భాస్కర్‌రెడ్డి సొమ్మసిల్లి పడిపోయారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కోడూరు సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి రోహిత్ రావు, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, రహమత్‌హుస్సేన్, చర్ల పద్మ, కర్ర సత్యప్రసన్నరెడ్డి, పులి అంజనేయులుగౌడ్, శ్రావణ్ నాయక్ పాల్గొన్నారు.

'జాన్సన్ కోరా'లో గ్రాడ్యుయేషన్ డే

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27:నగరంలోని జాన్సన్ కోరా పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 2023-24 విద్యా సంవత్సరంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, మెడల్స్‌ను ప్రదానం చేశారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, సంతోష్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యా ర్థులు, తల్లిదండ్రులను అభినందించారు.

దేవుడి పేరుతో బీజేపీ రాజకీయాలు

- గంగాధర రోడ్ షోలో మంత్రి పొన్నం ప్రభాకర్

గంగాధర, ఏప్రిల్ 27: దేవుడి పేరుతో రాజకీయాలుచేస్తూ ఓట్లడుగుతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15కు 2లక్షల రుణమాఫీ, వచ్చే పంట నుంచి 5వందల బోనస్ ఇచ్చి తీరుతామన్నారు. ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మాట్లాడుతూ దోచుకునే వారిని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్రసత్యప్రసన్న, వైస్ ఎంపీపీ రాజ్‌గోపాల్‌రెడ్డి, నాయకులు పద్మాకర్‌రెడ్డి, ఉప్పుల అంజనీ ప్రసాద్, తిరుమల్‌రావు, గునుకొండ బాబు, మనోహర్, బాపురెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం కేంద్ర పథకాలు



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్, ఏప్రిల్ 27: దేశంలో పేదరికాన్ని పోగొట్టేందుకు కేంద్రం పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన బీజేవైఎం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మే 2న హుజూరాబాద్‌లో బీజేవైఎం సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంపత్‌రావు, శశిధ ర్‌రెడ్డి, నికేష్, మాడ గౌతమ్‌రెడ్డి, రాముల కుమార్, రామరాజు, చైతన్యరెడ్డి, ప్ర శాంత్, సాయిరాం, రాంబాబు, దేవగౌడ్, చిరంజీవి, అశోక్ పాల్గొన్నారు.

బండి సంజయ్ హయాంలోనే అభివృద్ధి

చిగురుమామిడి: పార్లమెంటు పరిధిలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రూ. 12 వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ, గ్రామాల్లో శనివారం ఇంటింటా బీజేపీ ప్రచారం నిర్వహించారు. గాగిరెడ్డిపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిరుతల రామాయణం

ఇల్లందకుంట, ఏప్రిల్ 27: ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్స వాలను పురస్కరించుకొని లక్ష్మాజిపల్లి గ్రామ కళాకారుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన చిరుతల రామాయణం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం తెలంగాణ రంగస్థల కళాకారుల అసోసియేషన్ జిల్లా రథసారధి అధ్యక్షుడు వంగ సుధాకర్ కళాకారులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు అలివేలు సమ్మిరెడ్డి, నల్లగోని రమేష్‌గౌడ్, వీరెల్లి రామచంద్రరెడ్డి, నల్లగోని తిరుపతిగౌడ్, బాల్సాని యాదగిరి, దొంగల రాజయ్య, పడాల శ్రీనివాస్, పత్తి సమ్మిరెడ్డి, ముక్క రవి, సంపత్, మల్లేశం, సదానందం, శంకర్, లింగన్న, మొగిలిపాలెం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్

-పార్టీ ఆవిర్భావ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్27: తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్ పార్టీ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా తీగల గుట్టపల్లిలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమితిని కల్వకుంట చంద్రశేఖర్‌రావు 2001న స్థాపించారన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నాయకులు

కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో ఆమరణ నిరాహారదీక్ష చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీలో ఉండటం గర్వంగా ఉందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలు మనోభావాలు కాపాడటం కోసం బీఆర్ఎస్ పని చేస్తుందన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు మాదే

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు మాదే అని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని గంగుల కమలాకర్ అన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు నమ్మె స్థితిలో లేరన్నారు. 2014, 2018, 2023లో కూడా బీఆర్ఎస్ పార్టీ మూడోస్థానంలో ఉంటుందని గంగుల కమలాకర్ ఓడిపోతున్నారని విష ప్రచారం చేశారని, చివరకు ప్రజలు అద్భుత ఫలితాలు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 4నెలల లోపే బీఆర్ఎస్ లేని లోటు కనబడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ యాదగిరి సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, గంట కళ్యాణి, శ్రీనివాస్-శ్రీనివాస్, పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, షౌకత్ అలీ, ఒడ్నాల రాజు, గంగాధర చందు, పొన్నం రాజు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 27: నగరకాంగ్రెస్ మైనార్టీ సెల్ డివిజన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శుల నియామకం చేస్తూ నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు హైమద్ అలీ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ 5వ డివిజన్ అధ్యక్షులుగా సిరాజ్, 6వ డివిజన్ అధ్యక్షులుగా ఆరిఫ్‌ఖాన్, 29వ డివిజన్ అధ్యక్షులుగా మతిన్ హుస్సేన్, 40వ డివిజన్ అధ్యక్షులుగా తన్వీర్ హుస్సేన్, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఆసిఫ్, కార్యదర్శిగా సలీం హుస్సేన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'ముస్లిం రిజర్వేషన్లపై మోదీ దుష్ప్రచారం'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 27 : మోదీ ముస్లిం రిజర్వేషన్‌ల పైన దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాజొద్దీన్ ఆరోపించారు. ఆయన కరీంనగర్ 54వ డివిజన్ కార్యాలయంలో మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనకబాటును గుర్తించి రిజర్వేషన్లు ఇచ్చారని అన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ షబీర్, ఎండీ ఖలీమొద్దీన్, నూరుద్దీన్, ఎండీ దావూద్, ఎండీ అలీపాషా, ఎండీ ఇమామ్, ఇర్ఫాన్, వాజిద్, జమీర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 27: కరీంనగర్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి, సీనియర్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఆరెపల్లి మోహన్ అన్నారు. ఆరెపల్లి మోహన్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశానికి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10, 11, 12, 13, 35, 59 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్‌గా పోటీ చేసిన వారు, డివిజన్ ఇన్‌చార్జిలు, డివిజన్‌కు సంబంధించిన ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ నెల 29న కరీంనగర్‌లో జరిగే కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలన్నారు.

బాలభవన్‌లో చిన్నారులకు శిక్షణ ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 27: జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతీ యేటా 5 నుంచి 16 సంవత్సరాల బాల బాలికలకు వేసవి కాలంలో నిర్వహించే శిక్షణా శిబిరం అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమైంది. చిన్నారులు చిత్రలేఖనం, పెన్సిల్ పేయింటింగ్స్ హాండ్ రైటింగ్, గాత్ర సంగీతం, కర్ణాటక సంగీతం, లలిత, దేశభక్తి గేయాలు, మృదంగం, తబల, కంజీర, జానపద, క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టన్ నృత్యాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్, మెహందీ కోర్సులలో శిక్షణ జరుగుతోంది. అబాకస్, చెస్, శాస్త్రీయ నృత్యం, యోగాల్లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. రాధిక శిక్షణలో అబాకస్ (ఉదయం 8 నుంచి 9 గంటల వరకు), అనూప్ శిక్షణలో చెస్ (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు) ప్రతీ మంగళ, గురు, శని వారాల్లో శిక్షణ ఉంటుందని, ప్రతీ రోజూ సుహాసిని నేతృత్వంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు శాస్త్రీయ నృత్యం, మల్లిక నేతృత్వంలో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు యోగాలో శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

చేతి పంపుల మరమ్మతులో నిర్లక్ష్యం

-పగిలిన పైపులకు ట్యూబ్‌లతో రిపేరు -నీటి కోసం గ్రామస్థుల ఇక్కట్లు



దుర్శేడ్‌లో తుప్పు పట్టిన చేతి పంపు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్27: కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో చేతి పంపు మరమ్మతులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు తూతూమంత్రం గా పనులు చేస్తూ మమ అనిపించుకుంటున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనను విధించింది. కరీంనగర్ రూరల్ మండలంలో నీటి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ గ్రామాల్లో నాణ్యత లేని పనులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ రూరల్ దుర్శేడ్ గ్రామంలో మంచి నీరందించే ఒక బోరు పైపు పగలడంతో నీళ్ళు రాక ఇబ్బందులు పడ్డారు. అయితే అధికారులు మాత్రం కొత్త పైపు వేయకుండా పాత పైపుకే మరమ్మతులు చేపట్టారు. పాత పైపు పగిలిన చోట సైకిల్ టైర్ ట్యూబ్‌ను చుట్టి యథావిధిగా పైపును బోర్‌లో బిగించారు. శాశ్వత పరిష్కారం చేయాల్సిన అధికారులు నామమాత్రం మరమ్మతులు చేసి బిల్లులు తీసుకుంటున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు పకడ్బందీగా జరిగేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పగిలిన పైపునకు చుట్టిన ట్యూబ్

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'



మాట్లాడుతున్న తిరుపతయ్య

భగత్‌నగర్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికవ్యతిరేక, కార్పొరేట్ మతోన్మాద బీజేపీని ఓడించాలని సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య అన్నారు. శనివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బీజేపీని ఓడించాలని జిల్లా సదస్సు తీర్మానించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మి వర్గాన్ని దేశ ప్రజానీకాన్ని పది సంవత్సరాలుగా బీజేపీ మోసం చేసిందన్నారు. పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను అమలుచేసిందన్నారు. ఈ కోడ్‌లతో కార్మికుల సమ్మె హక్కు కోల్పోయారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు యు శ్రీనివాస్, జనగాం రాజమల్లు, గుడికందుల సత్యం పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఏప్రిల్ 27: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభు త్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశారన్నారు. ఆగస్టు 15లోగా రూ. 2లక్షల రైతు రుణమాఫీతో పాటు మహిళలకు 2,500 పింఛన్ అందజేస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధి అభివృద్ధి జరిగిందన్నారు. ఈ ఐదేళ్లలో ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నయా పైసా పనిచేయలేదన్నారు. బీజేపీ పార్టీ మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ అని చెప్పారు. బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికలతో బీఆర్ఎస్ పార్టీ కారు షెడ్డుకు పరిమితం కావడం ఖాయమన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్థాయిని మించి మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర మంత్రులపై మాట్లాడే అర్హత కౌశిక్‌రెడ్డికి లేదని, మాజీ సీఎం కేసీఆర్ వద్ద మెప్పు కోసమే ప్రెస్‌మీట్లు పెట్టి కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. 30న జమ్మికుంట లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజ యవంతం చేయాలని కోరారు. సమావేశంలో తుమ్మేటి సమ్మిరెడ్డి, వేముల పుష్పలత, సారంగపాణి, సొల్లు బాబు, నర్సింహారెడ్డి, టి రవీందర్, ఎం సదానందం, బి రమేశ్, డి అయిలయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్

బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలన

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 27: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 30న నిర్వహించనున్న ముఖ్యమంత్రి ఎనముల రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ శనివారం పరిశీలించారు. సభ ప్రధాన వేదిక, కార్యకర్తలు కూర్చోవ డానికి అవసరమైన గ్యాలరీలు చూశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

11 మంది బైండోవర్

మానకొండూర్, ఏప్రిల్ 27: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న యజమానులతో పాటు పాత నేరస్తులు 11 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గొడవలను నివారించేందుకు బెల్టు షాపులను మూసి వేయాలని ఆదేశాలున్నా వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. గతంలో వివిధ గొడవలకు మూల కారణమైన వారిని కూడా తహసీల్దార్ రాజు ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఎక్స్‌కావేటర్ యజమానికి జరిమానా

శంకరపట్నం, ఏప్రిల్ 27: శంకరపట్నం మండలం గొల్లపల్లి ఎక్స్‌కావేటర్ యజమానికి తహసీల్దార్ అనుపమ రూ. 50వేల జరిమానా విధించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గొల్లపల్లికి చెందిన సీహెచ్ శ్రీనివాస్ కొత్తగట్టు శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించారని ఫిర్యాదు అందిందన్నారు. ప్రాథమికంగా విచారణ చేసి శ్రీనివాస్‌కు రూ. 50వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక గానీ, మట్టి గానీ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఎమ్మెస్సార్ సేవలు మరువలేనివి



ఎమ్మెస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 27: దివంగత మాజీ మంత్రి ఎమ్మెస్సార్ రాష్ట్రానికి, జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని, ఆయనను ఆదర్శంగా తీసుకుని కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు సాగాలని మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మాజీ మంత్రి, మాజీ టీపీసీసీ అధ్యక్షుడు ఎం సత్యనారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని శనివారం డీసీసీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ఎమ్మెస్సార్ మనవడు మేనేని రోహిత్‌రావుతో పాటు పలువురు నాయకులతో కలిసి సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీగా, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసి ఆ పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కోడూరు సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, నగరకాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, టీపీసీసీ అధికారప్రతినిధి రోహిత్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, రహమత్ హుస్సేన్, చర్ల పద్మ, కర్ర సత్యప్రసన్నరెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, పులి అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని వీణవంక రోడ్డులో గల గణేష్‌నగర్ చౌరస్తా వద్ద మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో దివంగత నేత ఎమ్ సత్యనారాయణరావు మూడో వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొనగంటి మల్లయ్య, దిడ్డి రాము, శ్రీపతి నరేష్, పట్టణ అధ్యక్షులు కసుబోజుల వెంకన్న, చిన్నింటి నాగేంద్ర, మైస మహేందర్, గడ్డం దీక్షిత్, కాగితం శ్రీనివాస్, ప్రభుదాస్, రాజమౌలి, రాజ్‌కుమార్, సురేష్, ప్రవీణ్, రవి, శివ, ఉపేందర్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: వెదిరలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెన్న రాజమల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి అంజయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గుమ్మడి రాము, గౌడ సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మైనార్టీ నాయకులు షాబుద్దీన్, శుక్రోద్దీన్, బుచ్చవ్వ, లక్ష్మీ, దేవేంద్ర, ఎల్లవ్వ పాల్గొన్నారు.

నేడు ఆస్తిపన్ను చెల్లించవచ్చు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నులను ఈనెల 30లోగా చెల్లిస్తే 5శాతం రిబేట్ ఇస్తున్నందున ఆదివారం సెలవురోజు అయినప్పటికీ ఆస్తిపన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. 5శాతం రిబేట్‌కు కేవలం మూడురోజులు మాత్రమే మిగిలి ఉన్నందున మున్సిపల్ కార్యాలయంలో ఆస్తిపన్నుచెల్లింపు కౌంటర్లను తెరచి ఉంచామని, ఆన్‌లైన్‌లోగానీ, నేరుగా గానీ ఆస్తిపన్నుచెల్లించి రిబేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నగర అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: నగరంలోని 17వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీకి ఇటీవల రాజీనామా చేసిన కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మి భర్త కోల ప్రశాంత్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలువగా పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నట్లు ప్రశాంత్ తెలిపారు. తనతోపాటు తన సతీమణి కార్పొరేటర్ భాగ్యలక్ష్మి కూడా కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. మరికొంత మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతోంది.

హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 27: హుస్నాబాద్‌లో భూక్య రవినాయక్‌ను చిత్రహింసలు పెట్టిన హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకో వాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకుడు, కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. రవి నాయక్‌ను నిర్బంధించి చిత్రహింసలు పెట్టి లాఠీలతో విప రీతంగా కొట్టిన హుస్నాబాద్ సీఐని తక్షణమే సస్పెండ్ చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, ఏప్రిల్ 27: జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ పోటీల్లో చింతకుంటలోని ఎస్ఆర్ఎం ఎంబీఏ విద్యార్థులు ప్రభంజనం సృష్టిం చారు. హన్మకొండలోని వాగ్దేవి ఎంబీఏ కళాశాలలో మంత్రా 2024 పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఎస్ఆర్ఎం కళాశాల ఎంబిఏ విద్యార్థులు మార్కెటింగ్ విజార్డ్, ట్రెజర్ హంట్ లాంటి ఈవెంట్స్‌లో విజేతలుగా నిలిచి నగదు బహుమతులు సాధించారు. కళాశాల ఆవరణలో శనివారం విద్యార్థులను కళాశాల చైర్మన్ కరస్పాండెంట్ ఎం తిరుపతిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సి వెంకటేశ్వర్ రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగం ఇన్‌చార్జి ఎండీ ఖ్వాజామొయినుద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

భగత్‌నగర్, ఏప్రిల్27: వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి మండలానికి చెందిన పలువురు తాజా మాజీ సర్పంచులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. నగరంలోని ఎంపీ కార్యాల యంలో బీఆర్ఎస్ నాయకులకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ తాజా మాజీ సర్పంచులు చిట్యాల సురేష్, కొప్పెర లింగారెడ్డి, ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, కరండ్ల మధూ కర్‌తో కలిసి ఎంపి కార్యాలయానికి వచ్చి బండి సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారిలో రాజు, మధు, ఎడ్ల సురేష్, రవి, రాజేశ్, పూదరి చిన్నయ్య. పి వెంకట్, పి చెన్నులు, శంకర్, పి రాజేశ్, పి రమేష్, నక్కల నారాయణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి శస్త్ర చికిత్సలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్27: మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన పలువురు వృద్ధులకు బొమ్మకల్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ చింతల కిషన్, పటేల్ డిస్ట్రిక్ చైర్‌పర్సన్ హంగనఖ నిలిషఖ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320జి, ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి చెర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్ ట్రస్టసభ్యులు కోల అన్నారెడ్డి సహకారంతో రేకుర్తి కంటి ఆసుపత్రిలో 103 మందికి ఉచిత కంటి శస్త్ర చకిత్సలు నిర్వహి ంచారు. వీరికి మందులు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ చింతల ప్రభాకర్ పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● చిగురుమామిడి: మండలం వ్యాప్తంగా ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ ఇంటింటికీ కార్యక్ర మాన్ని నాయ కులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అధ్యక్షతన నిర్వ హించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

● గంగాధర: గంగాధర మండల బీఎస్పీ అధ్యక్షుడు పొత్తూరి సురేష్‌తో పాటు మండలంలోని ఆయా విభా గాల పార్టీ మండల, గ్రామశాఖ నాయకులు శనివారం ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరాడు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని తెలిపారు.

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌ను అధిక మెజారిటీతోగెలిపించేందుకు కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బూరుగు పల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు వివరించాలని తెలిపారు.,

● శంకరపట్నం: మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో మే డే ఉత్స వాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి కన్నం సదానందం, ఉపాధ్యక్షుడు తాడవేని రవి, దొమ్మేటి వెంకటస్వామి, బొజ్జ సంపత్, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని వరంగల్ రోడ్‌లో అక్ర మ కట్టడాలు, వ్యవసాయ భూముల్లో ప్రభుత్వ గుట్టల నుంచి తెచ్చి మొరం పోస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించు కోవడం లేదని యూత్ కాంగ్రెస్ నాయకుడు టి శ్రావణ్ అన్నారు. హుజూరాబాద్‌లో శనివారం ఆయన విలేకరుల తో మాట్లాడారు. ఈ అక్రమ కట్టడాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

● హుజూరాబాద్‌రూరల్: ఇప్పలనర్సింగాపూర్ గ్రామానికి చెందిన గూడురు స్వామిరెడ్డిని రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. స్వామిరెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

● జమ్మికుంట రూరల్: రసాయనాలతో మామిడి పండ్లు మాగబెట్టొద్దని కేవీకే ఉద్యాన విభాగ శాస్త్రవేత్త వేణుగోపాల్ అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఎరువులు, పురుగుల మందుల అమ్మకాలు జరిపే డీలర్లకు మామిడి పండ్లు మాగబెట్టే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

- రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద పట్టణ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలు వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు.

● మానకొండూర్: కొండపల్కాల మాజీ సర్పంచు మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నల్ల వంశీ ధర్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కొండపల్కాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో తన అనుచరులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతామని తెలిపారు.